ప్రజాశక్తి
మంగళవారం 7 నవంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

గిరిజన విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పాడేరు కేజీబీవి పాఠశాలలో చదువుతున్న గిరి విద్యార్థిని మృతి పట్ల నిర్లక్ష్యం చేసిన పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని రంగిలిసింగి పంచాయితీ కింజేరు గ్రామానికి చెందిన కిల్లో భాగ్యవతి (15) విద్యార్థిని పాడేరు కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి విద్యనభ్యసిస్తుందన్నారు. విద్యార్థిని గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆ పాఠశాల యాజమాన్యం వైద్యం చేయించకుండా, ఈనెల 2న తమకు సమాచారం అందించారని తల్లిదండ్రులు తెలిపారు.విద్యార్థినిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం విద్యార్థిని మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. విద్యార్థినికి సకాలంలో వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యం చేసిన పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని, , బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు పి.మోహన్‌దాస్, పి.కేశవరావు, పి.డుంబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రాథమిక స్థాయి నుండి విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రేరణ ఆధ్వర్యంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల ప్రాథమిక పాఠశాలలు, కెజిబివి పాఠశాలలో విద్యా ప్రమాణాలపై నిర్వహించిన సర్వేపై ఎంఇఓలు, ప్రధానోపాధ్యాయులకు సోమవారం వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు పఠనా సామర్థ్యాలలో వెనుకబడి ఉంటున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం విద్యార్థులతో మాట్లాడి పిల్లల పఠనా సామర్థ్యాలు పరిశీలించి తగని విధంగా బోధన అందించాలని చెప్పారు. ప్రాథమిక స్థాయిలో సక్రమంగా బోధిస్తే మధ్యలో బడి మానరన్నారు. తెలుగు, ఆంగ్ల భాషా, చరిత్ర, గణితం బోధించాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహ పూర్వక వాతావరణం ఉంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కెజిబి పాఠశాలలో ఉన్న విద్యా ప్రమాణాలపై సంబంధిత ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఇ ఓ గౌరీ శంకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ప్రేరణ ప్రోగ్రాం మేనేజర్ జి.నారాయణరావు, ఎంఇఓలు రామచంద్రరావు, సరస్వతి, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని కిటుముల పంచాయతీ పలడ గ్రామంలో సుమారు 30 లక్షల వ్యయంతో 800 మీటర్ల సిసి రోడ్డు పనులను చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషా దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ గెమ్మెలి రమణమ్మతో కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పలడ గ్రామంలో ఈ రహదారి అసంపూర్తిగా ఉందని, స్థానిక ప్రజలు గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యురాలు భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారని, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 30 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవ చూపి తమ గ్రామానికి రహదారి సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, వైఎస్ సర్పంచ్ బద్రి, పార్టీ నాయకులు సన్యాసిరావు, జెఈ బాలకిషోర్, కాంట్రాక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి, జెడ్పిటిసి

కోటీ 30 లక్షలతో అంగన్వాడీ భవనాల నిర్మాణం

ఎమ్మెల్యే ఫాల్గుణ

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ, పిఒ అభిషేక్

ప్రజాశక్తి -అరకులోయ: అరకు నియోజక వర్గంలో రూ.1 కోటి 30 లక్షల వ్యయంతో నిర్మించిన 13 అంగన్వాడీ భవనాలను అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ, ఐటిడిఏ పీఓ వి.అభిషేక్ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, కోటి 30 లక్షలతో అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. అనంతగిరి మండలంలో 3, అరకులోయ మండలంలో 2, హుకుంపేటలో 3, ముంచంగిపుట్టులో 1, పెదబయలులో 4 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్న పిల్లలకు, బాలింతలకు, గర్భవతులకు ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. లబ్దిదారులకు పోషకాహారం పంపిణీకి ఉపయోగ పడతాయని, లబ్దిదారులు అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఐటిడిఏ పిఓ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు సౌకర్యాలు మెరుగు పరుస్తు న్నామన్నారు. ఎస్‌సిఏ నిధులతో 35 అంగన్వాడీ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. పాడేరు నియోజక వర్గంలో గత నెలలో 12 భవనాలను ప్రారంభించామన్నారు. అరకుకు నియోజక వర్గంలో 13 ప్రారంభించినట్లు చెప్పారు. మిగిలిన 10 భవనాలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె. వేణుగోపాల్, తహశీల్దార్ ఏ.వేణుగోపాల్, అరకులోయ సిడిపిఓ కె.శారద, ఎంపిపి ఉషారాణి, వైస్ ఎంపిపిలు ఎల్.భీమరాజు, కె.రామన్న, ఎపిటిసి ఆనంద్ కుమర్, గిరిజన సంక్షేమ శాఖ ఎఇ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-పెదబయలురూరల్: మండలంలో సోమవారం వర్షం కురిసింది. ఈ వర్షంతో పొట్ట దశలో ఉన్న ధాన్యం, ఇతర వాణిజ్య పంటలకు ఊరటం కలిగిందని చెప్పుకోవచ్చు. తుపాన్ మొదలైతే రైతులకు తీరని నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతగిరి: వాయుగుండం ప్రభావంతో సోమవారం మండలంలోని కుండపోత వాన కురిసింది సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన భారీ కుండపోత వర్షం అర్ధరాత్రి వరకు ఏకధాటిగా కురిసింది.వ్యవసాయ పంటలతో పాటు పప్పు దినుసులు పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలకు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాలలో రైతులు కోతల అనంతరం నూర్పులు చేస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాలలో కోతలకు సిద్ధమవుతున్న సమయంలో ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు లబోదిబో మంటున్నారు.

మారేడుమిల్లి: గత కొన్ని రోజులుగా ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చెంది సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మండలంలో ఎడతెరిపి లేకుండా ఉరుములు మెరుపులు కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడంతో జనాలు ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి కొండ కాలువలు పొంగి పొర్లి, లోతట్టు గ్రామాలకు వెళ్లే రహదారులు జలమయమయ్యాయి.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో సోమవారం అతి భారీ వర్షం కురిసింది. దుర్గావీధి లోతట్టు ప్రదేశాలు జలమయమయ్యాయి. డ్రైనేజీల్లో నీరు పొంగి ప్రవహించాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉన్నప్పటికీ, మధ్యాహ్నం ఈదురుగాలులతో సీలేరు పరిసర ప్రాంతాల్లో గంటపాటు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. బజార్ మెయిన్ రోడ్‌లో వర్షపునీరు పొంగి ప్రవహించింది. ఆంధ్రాఒడిశా సరిహద్దులో గుంటువాడ సమీపంలో కోసిన వరి పంట పొలాలు తడిసి ముద్దయ్యింది.

సీలేరులో కురుస్తున్న వర్షం

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామారావు.

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది శ్రద్ధ చూపాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు కోరారు.సోమవారం గంగవరం ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు మౌలిక వసతులు గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ఏ విధంగా అందుతున్నది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, విద్యార్థినులకు రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు, మందులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు, ఇదే పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న చిట్టోజి అనూష కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మతి చెందింది. ఈ నేపథ్యంలో విద్యార్థిని మతికి కారణాలు, అందించిన వైద్య సేవలు గూర్చి అడిగి తెలుసుకున్నారు.

అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మ

ఎపి జెన్‌కో ఎఇ, అంబులెన్స్ సిబ్బంది చొరవపై అభినందన

అంబులెన్స్‌లోనే పుట్టిన పాపతో బాలింత, సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్‌కో అధికారుల చొరవతో పురిటి నొప్పులతో బాధపడుతున్న మారుమూల గ్రామానికి చెందిన గిరిజన మహిళ సుఖప్రసవమై అంబులెన్స్‌లోని పండంటి పాపకు జన్మనిచ్చింది. వివరాలివి. జికె.వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ మారుమూల రుష్యాగూడ గ్రామానికి చెందిన కిలో టుక్కుబాబు భార్య రాధమ్మ ఆదివారం రాత్రి సుమారు పది గంటల సమయంలో తీవ్రమైన పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త సీలేరు పిహెచ్‌సికి సమాచారమచ్చి అంబులెన్స్ పంపాలని కోరారు. పిహెచ్‌సి సిబ్బంది వెంటనే స్పందించి, ఎపి జెన్‌కో సిఎస్ఆర్ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు.

సిఎస్ఆర్ అంబులెన్స్ వచ్చేసరికి రాధమ్మ ప్రసవ వేదన తీవ్రమైంది. విషయాన్ని క్యాంపులో ఉన్న ఎఇ సురేష్‌కు అంబులెన్స్ సిబ్బంది వెంటనే సమాచారం అందించారు. ఆయన సూచనలతో అంబులెన్స్‌లో రాధమ్మను తీసుకొస్తుండగా, పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఇఎంటి సందీప్ అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపాలని డ్రైవర్ గణేష్‌కు సూచించారు. రాధమ్మ ప్రసవానికి చర్యలు చేపట్టగా, సుఖప్రసవమై పండటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అత్యవసర పరిస్థితిలో డెలివరీకి సహకరించిన అంబులెన్స్ సిబ్బందిని, చొరవ చూపిన ఎపి జెన్‌కో ఎఇ సురేష్‌ను పలువురు అభినందించారు.

అర్జీలకు స్పందన ఏదీ?

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని కొట్నా పల్లి పంచాయితీ పందిమెట్ట చెందిన వారు తాము సాగు చేసుకుంటున్న పోడు భుములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ 2022లో ఐటిడిఎలో జరిగిన స్పందనకు దరఖాస్తు చేసున్నామని, అయినా స్పందన లేదని గ్రామస్తులు పాంగి కేశవరావు, పాంగి నూకరాజు, పాంగి అప్పారావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోనీ 33 కుటుంబాలు పుర్వీకుల నుండి వారసత్వంగా పోడు భుమి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కొండ పోడుపైనే ఆధారపడి జీవిస్తున్నామన్నారు. వీటికి హక్కుపత్రాలు ఇవ్వాలని కోరుతూ మూడు పర్యాయాలు స్పందనలో దరఖాస్తు చేసుకున్నామని గుర్తు చేశారు. సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. తమ అర్జీలకు స్పందన ఏదని వారు ప్రశ్నించారు. ఇదే విషయమై స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలో మూడుసార్లు కలిసామన్నారు,ఫారెస్ట్ అధికారులను కలిసినా పలితం లేదని ఆదేవన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్జీలను చూపుతున్న గ్రామస్తులు

జాతీయ రహదారి బాధితులకు

నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-చింతపల్లి: జాతీయ రహదారి బాధితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించిన తర్వాతే ఖాళీ చేయించాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయతో కలిసి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు జాతీయ రహదారి బాధితుల తరపున సీఎం జగన్మోహన్ రెడ్డికి రాసిన లేఖను చింతపల్లి పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. లేఖలు అంశాలను వివరించారు. విజయనగరం నుండి రాజమండ్రి వరకు జాతీయ రహదారి ఎన్ హెచ్156ఇ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిం చిందన్నారు.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనంతగిరి, అరకు, డుంబ్రిగూడ, హుకుంపేట, పాడేరు, జిమాడుగుల, జీకే వీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి 11 మండలాల్లో రహదారి నిర్మాణం పనులు గుత్తేదారులు ప్రారంభించి 30 శాతం పనులు పూర్తి చేశారన్నారు. జిరాయితి పట్టా, అటవీ పోడు భూములు కలిపి సుమారు 50 ఎకరాలు రహదారి ఇరువైపులా ధ్వంసం చేశారన్నారు. అటవీ హక్కు పత్రాలు జారీ చేయవలసిన అధికారులు పత్రాలు లేవని మాయమాటలు చెప్పి బలవంతంగా భూములు లాక్కున్నారన్నారు. జీకే వీధి మండలం పెదవలస పంచాయతీ నాలుగు గ్రామాలు సంకట పంచాయతీ ఆరు గ్రామాల్లో ఉన్న స్థానిక ఆదివాసులు జాతీయ రహదారి నిర్మాణంలో సాగుభూమి కోల్పోయినా నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు.రహదారి నిర్మాణ బాధితుల జాబితా వివరాలను పంచాయితీ, సచివాలయ కేంద్రాల్లో పెట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

లేఖను చూపుతున్న చిన్నయ్యపడాల్

స్పందన సమస్యల సత్వర పరిష్కారం

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే : 42 అర్జీలు స్వీకరణ

వినతులు స్వీకరిస్తున్న పిఒ సూరజ్, ఇతర అధికారులు

ప్రజాశక్తి -రంపచోడవరం : స్పందనలో వచ్చిన ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన వ్యక్తిగత, సామాజిక సమస్యలను సంబంధిత అధికారులకు నివేదించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు స్థానిక ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే స్పష్టం చేశారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో రంపచోడవరం సబ్ కలెక్టర్‌శుభం బన్సల్‌తో కలిసి స్పందనలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి 42 దరఖాస్తులు వచ్చాయి.

.వై. రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని కొండరెడ్డి కులస్తులను అభివద్ధి చేయుటకు ఐటిడిఎ పరిధిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాని, కొండరెడ్డి కులస్తులకు అంత్యోదయ కార్డులను ఇచ్చి ప్రతినెలా 35 కేజీల బియ్యం అందజేయాలని, అర్ధాంతరంగా ఆగిపోయిన మంగంపాడు ప్రభుత్వ ఆసుపత్రి భవనం పనులు పూర్తి చేయాలని, పాలగెడ్డ నుంచి తులసూరు గ్రామానికి కొత్త రోడ్డు ఏర్పాటు చేయాలని సరంకోట అబ్బాయి రెడ్డి. నైని పండయ్య దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం వేములకొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇపుడున్న ఒక టీచర్‌కు అదనంగా మరొకరిని నియమించాలని నూకలేటి అక్కమ్మ. రేవుల లక్ష్మి. సాధన ప్రతాప్ రెడ్డి దరఖాస్తు సమర్పించారు.నిరుద్యోగులమైన తమకు ఉద్యోగావకాశాలు కల్పించాలని రంపచోడవరం మండలం పెద్దపెద్ద గ్రామానికి చెందిన అరగటి స్వామినాథరెడ్డి వేములకొండ గ్రామానికి చెందిన సి హెచ్ భారతి వేర్వేరుగా దరఖాస్తులిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్‌రాజ్, డిఎస్ శాస్త్రి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఎడిఎంహెచ్‌ఒ జి. ప్రకాశం, వెలుగు ఎపిడి ఎ. శ్రీనివాసరావు, వెటర్నరీ డిడి షరీఫ్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి.చౌదరి, డిఎల్‌డిఒ కె.కోటేశ్వరరావు, ఇఇలు జి.డేవిడ్‌రాజ్, మహ్మద్ యూసఫ్, సుబ్బయ్య, పిఎఒ రాంబాబు. పిహెచ్‌ఒ చిట్టిబాబు, జిసిసి సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, డాక్టర్ ఇందిర, ఎంపిడిఒ. హరికృష్ణ, సిడిపిఒ సంధ్యారాణి, డిఇ సాయిసతీష్, రాజేంద్ర బాబు, ఎస్ఎంఐ డిఇ శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి , ఎపిఇపిడిసిఎల్ డిఇలు వై. మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ స్వామి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో పాలనలో కొత్త ఒరవడి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-కొయ్యూరు : గ్రామ సచివాలయ వ్యవస్థతో పాలనలో కొత్త ఒరవడికి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నాంది పలికారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని చిట్టింపాడు, వెలగాలపాలెం గ్రామ సచివాలయాలను, నడింపాలెం, వెలగలపాలెం రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమస్యలపై జిల్లా, డివిజన్ మండల కేంద్రాలకు ప్రజలు వెళ్లి ఇబ్బందులు పడే పరిస్థితుల నుంచి పాలనను ప్రజలకు చేరువచేసేలా సచివాలయ వ్యవస్థను ఊరూరా ఏర్పాటు చేశారన్నారు. అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజల అవసరాలను తీర్చేలా ఈ వ్యవస్థ పనిచేస్తోందన్నారు. ఇవే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్య సురక్ష వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్ , జెడ్పిటిసి వారా నూకరాజు, సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి, ఎంపిటిసి బిడిజన అప్పారావు, వైస్ ఎంపిపి అప్పన వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, ఎఎంసి చైర్మన్ జైతి రాజులమ్మ, బిసి డైరెక్టర్ గాడి నాగమణి, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసలినాయుడు, జెసిఎస్ మండలకన్వీనర్ బండి సుధాకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రామన గంగాధర్, నేలపు సూరిబాబు, మండల బూత్ కన్వీనర్ పొట్టిక పోతురాజు, సర్పంచులు పొట్టిక భవాని , రేమల శ్రీను, కూడా రాజుబాబు, రాజకుమారి, వైస్ సర్పంచులు కాళ్ళ వనం బాబు, బుక్క చంటి, ఎఎంసి డైరెక్టర్ అచ్యుత్, మండల నాయకులు పిట్ల గాంధీ, రామ్మూర్తి, రామరాజ్యం, పాటి శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ గాడి అచ్చిరాజు, నాయకులు బిత్తిరి కల్యాణం, కొండలరావు, దుంప రాజబాబు, చంటిబాబు, దేపూరి రాజబాబు, నూకరాజు, పోతురాజు, ఈశ్వరరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సంకల్పయాత్ర ఆరేళ్ల సంబరాలు

కొయ్యూరు : సిఎం జగన్మోహనరెడ్డి సంకల్పయాత్రకు ఆరేళ్ల పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పోడు భూముల సర్వే చేసి అప్పగించండి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జెఎసి నేతలు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: కొండపోడు పట్టాలు ఇచ్చిన వారందరికీ భూములు రీ సర్వే చేసి భూములు అప్పగించాలని ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం దేవీపట్నం తహశీల్దార్ సత్యానారాయణకు వినతిపత్రం అందజేశారుఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ దేవీపట్నం మండల పరిధిలోని దేవారం గ్రామపంచాయతీ పోతవరం,దేవారం గ్రామాలలో ఆదివాసీ పేదలకు 78 మందికి కొండపోడు పట్టాలు ఇచ్చారన్నారు.కానీ నేటికీ భూములు రీసర్వే చేసి అప్పగించ లేదన్నారు. కొండపోడు పట్టాలు ఇచ్చిన ఆదివాసీలకు భూముల పొజిషన్ చూపించాలని విన్నవించారు. ఈ నెల 14,15 తేదీలలో పాడేరులో జాతీయ స్థాయిలో జరిగే బిర్సా ముండా జయంతి వేడుకలు, ఆదివాసీ సదస్సుకు రావాలని దేవీ పట్నం తహశీల్దార్ కె.సత్యానారాయణకు ప్రత్యేక ఆహ్వాన పత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, కలుం సూర్య ప్రకాష్, మడకం సుధీర్ కుమార్ దొర, కారం చెల్లాయమ్మ, తాటి గంగాభవాని, తుర్రం యశ్వంత్‌కుమార్ దొర, కుంజం లక్ష్మి, కుంజం అబ్బాయి దొర, తుర్రం అరవాలమ్మ, తుర్రం సావిత్రి, చవలం భద్రమ్మ, కారం సూరన్న దొర, మడకం ముత్యాలు దొర, కారం పోసిబాబు దొర, పరదా రమేష్ దొర పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్‌లతో పరేషాన్!

పాడైన బస్‌ను లాక్కొని వెళుతుండగా ప్రమాదం

ప్రజాశక్తి - మారేడుమిల్లి: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గోకవరం డిపో నుండి వై రామవరం మండలం పాతకోటకు వెళ్లే ఆర్‌టిసి బస్సు ఆదివారం ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో మారేడుమిల్లి మండలం ఉప్పరి గోతులు గ్రామ సమీపంలో నిలిచిపోయింది. పాడైన బస్సును వేరొక బస్సుకు కట్టి లాక్కొని వెళుతుండగా మారేడుమిల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో టేకు ప్లాంటేషన్ దగ్గరలో పాడైన బస్సుకు కట్టిన ఇనుప గొట్టం ముందున్న బస్ నుంచి వేరవ్వడంతో వెనుక బస్సు లోయలోకి దూసుకెళ్లింది. బస్సులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ రహదారిలో తరచూ బస్సులు సాంకేతిక లోపాలతో నిలిచి నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులను ఏజెన్సీకి, ఘాట్‌రోడ్లలోకి పంపడం ద్వారా ఆర్‌టిసి అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వాపోయారు. గతంలోనూ ఈ రహదారి వెళ్లిన బస్సు వెనకన్ను రెండు చక్రాలు ఊడిపోయిన ఘటనలు వంటి ప్రమాదాలు అనేక జరిగాయి. ఇప్పటికైనా ఆర్‌టిసి యంత్రాంగం స్పందించి, మన్యంలోని గ్రామాలకు ఫిట్‌నెస్ ఉన్న బస్సులను నడపాలని పలువురు కోరుతున్నారు.

లోయలోకి దూసుకెళ్లిన ఆర్‌టిసి బస్సు

పాత్రికేయులకు మైదాన ప్రాంతంలో ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేస్తున్న గిరిజనేతరులైన విలేకరులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకులు సి.హెచ్.బి. ఎల్. స్వామి, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు బి.నాగరాజు మాజీ సభ్యులు కే.ప్రభుదాస్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న గిరిజనేతరులైన విలేకరులకు సమీప మైదాన మండలాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏపీయూడబ్ల్యూజే ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.ప్రభుత్వం విడుదల చేయనున్న జీఓలో ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతరులైన విలేకరులకు, ఇళ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని కూడా, పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. లేదంటే ఏజెన్సీ ప్రాంతాల్లో దశాబ్దాల తరబడి పని చేస్తున్న విలేకరులుకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారి యంత్రాంగం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు కోరారు.

ఎన్నికల్లో పాడేరు నుంచి పోటీ : సిపిఐ

ప్రజాశక్తి -పాడేరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు నియోజకవర్గం నుంచి సిపిఐ బరిలో నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తెలిపారు. పాడేరు సిపిఐ కార్యాలయంలో సోమవారం పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం, రాష్ట్రాలలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ, వైసీపీలను గద్దె దింపే సమయం ఆసన్నమైందన్నారు. గతంలో చింతపల్లి నియోజక వర్గంగా ఉన్న సమయంలో రెండు పర్యాయాలు సీపీఐ తరపున గొడ్డేటి దేముడు విజయం సాధించడం జరిగిందని, ఆయన గుర్తు చేశారు. వైసిపితో గిరిజనులకు ఒరిగిందేమీ లేదన్నారు.ఈ కార్యక్రమంలో. సిపిఐ నాయకులు కూడ రాధాకృష్ణ, కమిడి సింహాచలం, రాజశేఖర్, రాజు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత కార్యాలయంలో మిషన్ వాత్సల్య కింద మంజూరైన 22 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతి పై భర్తీ చేయుటకు వివిధ కేటగిరీలలో పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ విభాగంలో 11 పోస్టులు, ప్రత్యేక దత్తత విభాగం లో 11 పోస్టులు కేటాయించారని తెలిపారు. అభ్యర్థులు 2023 జూలై ఒకటవ తేదీ నాటికి 25 సంవత్సరాల నుండి 42 సంవత్సరాలు లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు అర్హతలు, అనుభవం, తదితర వివరాలకు డిస్ట్రిక్ట్ వెబ్ సైటు లో చూడవచ్చని, దరఖాస్తు డౌన్లోడ్ చేసుకొని పూర్తి చేయాలన్నారు. ఈనెల 16వ తేదీ లోపు కార్యాలయ పని దినములలో స్వయంగానూ, లేదా రిజిస్టర్ పోస్టులో దరఖాస్తులు పంపాలన్నారు.

శాస్త్ర విజ్ఞాన రంగంలో పరిశోధనలు

ప్రజాశక్తి -మధురవాడ : నోబుల్ బహుమతి గ్రహీతలను స్ఫూర్తిగా తీసుకొని శాస్త్ర విజ్ఞాన రంగంలో పరిశోధనలు జరపాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం పిలుపునిచ్చారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ విశాఖ శాఖ సోమవారం నిర్వహించిన 2023 నోబుల్ బహుమతి శాస్త్రవేత్తల విశిష్టత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. భారతీయ శాస్త్రవేత్తలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ఇతర దేశాలకు వెళ్లి తమ ప్రతిభను చాటుతున్నారని చెప్పారు. ప్రభుత్వం శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో నోబుల్ బహుమతి అందుకునే స్థాయిలో పరిశోధనలు జరపాలని సూచించారు. గీతంలో మూర్తి పేరిట పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ విశాఖ శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ బివిఆర్.టాటా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ దీపాంకర్ నంది ఈ ఏడాది వైద్య రంగంలో నోబుల్ బహుమతికి ఎంపికైన శాస్త్రవేత్తలు కెటాలిన్ కారికో, వైజ్మెన్ల పరిశోధనల విశేషాలను వివరించారు. హైదరాబాద్లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చి ప్రొఫెసర్ ఎమ్.కృష్ణమూర్తి తన ప్రసంగంలో ఈ ఏడాది నోబుల్ బహుమతికి ఎంపికైన పెరీఅగస్టినీ, ఫ్రెంక్ క్రాజ్, అన్నేహులియర్ భౌతిక శాస్త్రంలో జరిపిన పరిశోధనలను వివరించారు. హైదరాబాద్లోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్వేర్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ బిఎల్వి.ప్రసాద్ తన ప్రసంగంలో ఈ ఏడాది రసాయన శాస్త్రంలో నోబుల్ బహుమతికి ఎంపికైన శాస్త్రవేత్తలు మోంగి బవేండి, లూయిస్ బ్రస్, అలెకి యకిమోవ్ల పరిశోధనల గురించి వివరించారు.

15న బహిరంగసభను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పోస్టర్ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి- పాడేరు:కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి మద్దతిస్తూ వైసిపి, టిడిపి, జనసేనలు రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక రాజకీయాలను చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. ఈనెల 15న విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం పాడేరు మండల కార్యదర్శి ఎల్.సుందరరావుతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, దళిత, గిరిజన వ్యతిరేక రాజకీయాలను వైసిపి, టిడిపి, జనసేనలు బల పరుస్తున్నాయన్నారు. వీటిని ప్రజలకు వివరించడమే ప్రజా రక్షణ యాత్ర లక్ష్యమని చెప్పారు. దళితులు, గిరిజనుల హక్కులను హరించేలా పార్లమెంటులో చట్టాలు చేస్తున్న బిజెపికి సంపూర్ణంగా మద్దతు ఇస్తూ ఆ పార్టీలు రాష్ట్రంలో మోసపూరిత రాజకీయాలు చేస్తున్నాయని తెలిపారు. పార్లమెంటులో మద్దతిస్తూ రాష్ట్రంలో సాధికార యాత్రలు చేయడమేమిటని ప్రశ్నించారు. వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రలో మంత్రుల ఉపన్యాసాలు వింటుంటే హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఒకవైపు సామాజిక న్యాయాన్ని హరిస్తూ మరోవైపు వారే కాపాడుతున్నామంటూ ఊరేగింపులు, సంబరాలు చేస్తూ సాధికారితను అపహాస్యం చేశారన్నారు. ఉపాధి హామీ పనులకు కోతలు విధించారని, బడ్జెట్లో నిధులు తగ్గించారని, దీనికి వైసిపి మద్దతు తెలిపిందని చెప్పారు. పనికి ఆహార పథకం మీద ఆధారపడేది ఎక్కువమంది దళితులు, పేదలేనని వివరించారు. సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి బిజెపి తూట్లు పొడుస్తుంటే, వాటన్నింటికి మద్దతిస్తున్న వైసిపికి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. ఈ విషయాలన్నింటినీ ప్రజలకు చెప్పేందుకే సిపిఎం ఆధ్వర్యాన ప్రజా రక్షణ యాత్ర చేస్తున్నట్టు చెప్పారు. 2024లో ఎన్నికల్లో మళ్లీ కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకుండా చేయాలని, రాష్ట్రంలో దాని పల్లకీ మోస్తున్న మూడు పార్టీలూ తమవైఖరి మార్చుకోవాలని సూచించారు. తమ రాజకీయ వైఖరి స్పష్టంగా ఉందని, బిజెపిని వ్యతిరేకించి వచ్చేవారితో కలిసి పనిచేస్తామని, సానుకూలంగా ఉండేవారిపై పోరాడతామని పేర్కొన్నారు. ఇక్కడ వైసిపి, టిడిపి, జనసేన బిజెపితోసానుకూలంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై వారి వైఖరి మార్చుకోవాలన్నారు. ఫలితంగా రాష్ట్రంలో ప్రజలపై పెనుభారాలు పడుతున్నాయని తెలిపారు. కేరళలో బాంబు పేలుడు జరిగితే దానికి హమాస్తో లింకుపెట్టి బిజెపి కేంద్ర మంత్రి తప్పుడు ప్రచారం చేశారన్నారు.ఐదు రాష్ట్రాల్లో బిజెపికి ఎదురుగాలి వీస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బొజ్జన్న, బాలయ్య పాల్గొన్నారు.

రిఫరల్ కేసులపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిభిరాలలో గుర్తించి మెరుగైన చికిత్స కోసం వివిధ ఆసుపత్రులకు రిఫర్ చేసిన కేసులను ఫాలో అప్ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలోని అన్ని మండలాల ఎంపిడిఓలు, మెడికల్ అధికారులు, సిడిపిఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 287 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి 1,57,137 మందిని పరీక్షించడం జరిగిందని తెలిపారు. ఇందులో సుమారు తొమ్మిది వేల మందిని మెరుగైన చికిత్స కోసం వివిధ ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరిగిందని, వారిని ఫాలో అప్ చేయాలని కలెక్టర్ సూచించారు. కంటి వెలుగు కింద 19,138 మందిని స్క్రీనింగ్ చేయడం జరిగిందని, అవసరమైన వారికి కేటరాక్ట్ చికిత్స అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక వైద్య శిభిరాలలో 6,336 హైపర్ టెన్షన్ కేసులు, 1435 మందిని రక్త హీనత,1262 మందిని డయాబెటిక్ రోగులుగా గుర్తించడం జరిగిందని వారికి తగు చికిత్సలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏకలవ్య, కెజిబివి, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఎత్తు, బరువు పరీక్షించి ఎదుగుదలకు తగు మందులు, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సుమారు 20 వేల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించలేదని, కొన్ని పాఠశాలలలో అసలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించలేదని గుర్తించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపిడిఓ పర్యవేక్షణలో సంబంధిత మెడికల్ అధికారి, ఆశ, ఎఎన్ఎంలు మహిళా పోలీసు సహకారంతో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. రానున్న 15 రోజుల్లో విద్యార్థులందరికీ పరీక్షలు పూర్తి చేయాలన్నారు. గత సెప్టెంబర్ నుండి 16 మాతృ మరణాలు జరిగాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఎంహెచ్ఓ సి.జమాల్ బాష, జిల్లా టిబి నియంత్రణాదికారి విశ్వేశ్వర నాయుడు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాధన, డిటిటి ప్రాజెక్ట్ అధికారి భారతి దేవి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎన్ సూర్య లక్ష్మి మండలాల నుండి ఎంపిడిఓలు, మెడికల్ అధికారులు, సిడిపిఓలు, పాల్గొన్నారు.

తాళ్లవలసలో జిమ్సర్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్టిఆర్ సేవా సమితి ట్రస్ట్, ఎంవివిఎస్.మూర్తి ట్రస్ట్, రుషికొండ జిమ్సర్ గీతం దంత వైద్య కళాశాల ఆధ్వర్యాన భీమిలి మండలం తాళ్ళవలసలో సోమవారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు ప్రారంభించారు. చెవి, ముక్కు, గొంతు, దంత, ఎముకలు, నేత్ర వైద్య పరీక్షలతో పాటు బిపి, సుగర్ పరీక్షలు చేశారు. దాదాపు 12 విభాగాలకు చెందిన వైద్య నిపుణులు కృష్ణచైతన్య, పావని, యోగి, హరిదీప్, గీతిక, ఆదిత్య, సమీరా, వీరేంద్ర తదితరులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డిఎన్.రాజు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పతివాడ రాంబాబు, పార్టీ నాయకులు యరబాల అనిల్ ప్రసాద్, సంకురుభుక్త ప్రకాష్, పాసి త్రినాధ్కుమార్, ఎంపిటిసి కోరాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

8న 'ఉక్కు' మహాదీక్ష

ప్రజాశక్తి -గాజువాక, ఉక్కునగరం : స్టీల్ప్లాంట్ కార్మికులు చేపట్టిన దీక్ష ఈ నెల 8వ తేదీకి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా చేపట్టే మహాదీక్షను జయప్రదం చేయాలని అఖిలపక్ష యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్లాంట్ బిసి గేటు వద్ద కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, మహా దీక్షలో ఉక్కు కార్మికులు, కుటుంబ సభ్యులతో సహా హాజరై జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు స్టీల్ప్లాంట్ను ప్రయివేటుకు దారాదత్తం చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. ఉక్కు కర్మాగారం ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన వచ్చేంత వరకు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. శాశ్వత ఉపాధి కోసం ఉక్కు నిర్వాసితులు పోరాటాలలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, యు.రామస్వామి, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

998వ రోజుకు దీక్షలు

ఉక్కునగరం : విశాఖ స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు ఈ నెల 8వ తేదీకి 1000 రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో ఏర్పాటుచేసే కార్యక్రమాల్లో కార్మికులు, అధికారులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు సోమవారంర నాటికి 998వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్ప్లాంట్ ఎల్ఎం, ఎస్బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా గాజువాక వచ్చిన వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కలిసి స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రధానపాత్ర పోషించి ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి నరేంద్ర, ఎం.త్రినాథ్, కె.భాస్కర్, పి.సీతారామరాజు, ఎల్వి.రమణ, ఎ.రాము, డి.సత్యనారాయణ, బి.నాగరాజు, మంగ వెంకటరావు పాల్గొన్నారు.

పెందుర్తిలో ఎక్స్ప్రెస్ రైళ్లు ఆపాలని వినతి

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్లో ఎక్స్ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇప్పించేలా కృషిచేయాలని కోరుతూ అనకాపల్లి ఎంపీ సత్యవతికి రాయల్ కెసిఆర్ అపార్ట్మెంట్ వాసులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.పూర్ణచంద్రరావు, సభ్యులు గౌరీ మాట్లాడుతూ, పెందుర్తిలో రైల్వేస్టేషన్ ఏర్పాటుచేసి సుమారు 60 సంవత్సరాలు దాటినా నేటికీ ఎక్స్ప్రెస్ రైళ్లు ఆపకపోవడం బాధాకరమన్నారు. రైలు ప్రయాణం చేయాలంటే సుమారు 20 కిలోమీటర్ దూరంలో ఉన్న విశాఖ వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి ఎక్స్ప్రెస్ రైళ్లన్నీ ఆగేలా చర్యలు చేపట్టాలని కోరారు. వైసిపి నాయకులు దాడి రమణచిట్టి, డి.ఉమేశ్వరరావు సహకారంతో ఎంపీని అపార్ట్మెంట్ వాసులు కలిశారు.

గుణాత్మక విద్యనందించాలి

ప్రజాశక్తి-భీమునిపట్నం : ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో గుణాత్మక విద్యనందించాలని విద్యా శాఖ జోన్-1 జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు, రిసోర్స్ పర్సన్లకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డైట్లో జిల్లా స్థాయి స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ల రెండ్రోజుల శిక్షణా తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ తరగతుల ద్వారా నేర్చుకున్న అంశాలను సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని రిసోర్స్ పర్సన్లకు స్పష్టం చేశారు. అభ్యసన సామర్థ్యాలను మెరుగు మెరుగు పరచడానికి తగిన కృత్యాలతో అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ, విద్యార్థుల అభసనాభివృద్ధికి కృషి కొనసాగిస్తామని తెలిపారు. డైట్ ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప విద్యా శాఖాధికారి ఎ.గౌరీశంకరరావు, సమగ్ర శిక్ష ఎపిసి బి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ జి.రవి, రిసోర్స్ పర్సన్లు జె.మాధవి, పి.హరిణి, గిరిబాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి ద్వారా చిన్న వాహనాలకే అనుమతి

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని పోలీసులు ఆంక్షలు విధించారు. నాలుగు చక్రాలు దాటిన వాహనాలు అండర్ బ్రిడ్జి ద్వారా రాకపోకలు సాగించకూడదని ట్రాఫిక్ సిఐ సిహెచ్.వెంకటరావు స్పష్టంచేశారు. ద్విచక్రవాహనాలు, మూడు చక్రాల ఆటోలకు మాత్రమే అనుమతి ఉందని తెలిపారు.

వైద్య పరికరాల పనితీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ మల్లికార్జున

కార్పొరేట్కు ధీటుగా కెజిహెచ్లో సేవలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నాడు - నేడు పథకం, ప్రయివేటు కంపెనీల సిఎస్ఆర్ నిధుల సహకారంతో కెజిహెచ్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, కార్పొరేట్కు ధీటుగా పేద ప్రజలకు ఇక్కడ మరిన్ని వైద్య సేవలు అందించనున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. రూ.5.16 కోట్ల సిఎస్ఆర్ నిధులతో హెచ్పిసిఎల్ సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను, ఆక్సిజన్ యంత్రాలను, స్ట్రెచర్లను హెచ్పిసిఎల్ ఇడి వి.రత్నరాజ్, సిజిఎం కిరణ్ కుమార్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఇతర వైద్యాధికారులతో కలిసి స్థానిక కెజిహెచ్ సిఎస్ఆర్ బ్లాక్లో సోమవారం కలెక్టర్ అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో పరికరం వద్దకు వెళ్లి వాటి పనితీరు, ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించేందుకు అనుగుణంగా హెచ్పిసిఎల్ కంపెనీ ముందుకు వచ్చి సహకారం అందించటం అభినందనీయమన్నారు. ఆధునిక వసతులతో కూడిన తొమ్మిది అంబులెన్సులను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటన్నింటి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ప్రజలు తప్పకుండా సంతోషం వ్యక్తం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్పిసిఎల్ ఇడి వి.రత్నరాజ్ మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలందించే కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం సంతోషకరంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తామన్నారు.

జమాల్ఖాన్ ఆయుర్వేద చికిత్సా కేంద్రం సీజ్

ప్రజాశక్తి - ఎటపాక :జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జమాల్ఖాన్ ఆయుర్వేద చికిత్స కేంద్రాన్ని అధికారులు సోమవారం సీజ్ చేశారు. సోమవారం ఎటపాకలోని జమాల్ఖాన్ ఆయుర్వేద కేంద్రాన్ని ఎటపాక తహశీల్దార్ పృధ్వీ, నెల్లిపాక వైద్యాధికారి డాక్టర ప్రత్యూష సందర్శించి అక్కడ దొరికిన మందులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు కార్యక్రమంలో రెవెన్యూ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దిశా వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో ఉన్న దిశ సఖి వన్ స్టాప్ సెంటర్ సిబ్బందికి 12 మాసాలుగా బకాయి ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో దిశా వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది ఆందోళనకు దిగారు. స్పందనలో కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 2017 జూన్ నుంచి ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం దిశ వన్ స్టాప్ సెంటర్లో 18 మంది వివిధ కేటగిరీల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సెలక్షన్ కమిటీకి ఛైర్మన్గా కలెక్టర్ ఉన్నారన్నారు. ఏడేళ్ల క్రితం సఖి వన్ స్టాప్ సెంటర్లో చేరిన సిబ్బందికి అప్పట్లో ఎంత జీతం ఇస్తున్నారో.. ఇప్పుడు కూడా అదే జీతం ఇస్తున్నారని తెలిపారు. అది కూడా ఎప్పుడు బడ్జెట్ వస్తే అప్పుడు ఇస్తున్నారని తెలిపారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో పలువురు రోగగ్రస్తుల వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.9 లక్షలా 15 వేలను సోమవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ బాధితులకు చెక్కుల రూపంలో అందజేశారు. లబ్ధి పొందిన వారిలో 39వ వార్డుకు చెందిన పట్నాల దివాకర్కు రూ.6 లక్షలు, అదే వార్డుకు చెందిన సూరాడ అనూషకు రూ.35 వేలు, కారి పైడికొండకు రూ.35 వేలు, 32వ వార్డుకు చెందిన జిల్లెల లక్ష్మికి రూ.70 వేలు, 30వ వార్డుకు చెందిన క్రాలేటి సంధ్యకు రూ.25 వేలు, 27వ వార్డుకు చెందిన సంకిలి సుందర్రావుకు రూ.లక్షా 50 వేలను అందించారు.

పోలీసు బలగాల నడుమ..

హెటిరో పైపులైన్ పనులు ప్రారంభం

రాజయ్యపేట గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసిన వైనం

ప్రజాశక్తి - నక్కపల్లి, అనకాపల్లి

హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్త పైపులైన్ పనులు ఆదివారం పోలీసు బలగాల నడుమ ప్రారంభమయ్యాయి. ఈ పైపులైన్కు వ్యతిరేకంగా సుదీర్ఘకాలంగా మత్స్యకారులు, ప్రజలు పోరాడుతున్న నేపథ్యంలో అక్కడ ఎటువంటి గొడవలూ జరగకుండా డిఎస్పిలు మహేశ్వరరావు, శ్రీనివాసరావు, పది మంది సిఐలు, 20 మంది ఎస్ఐలు, సుమారు 400 మంది కానిస్టేబుళ్లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎఎస్పి ఆదిరాజ్ సింగ్ రాణా కూడా వచ్చి పర్యవేక్షించారు. హెటిరో డ్రగ్స్ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడానికి ఇప్పటికే పాత పైపులైన్ ఉంది. అయితే ఆ పైపులైన్ అంత ఉపయోగకరంగా లేదంటూ కంపెనీ యాజమాన్యం మూడు అడుగుల వైశాల్యంతో కొత్త పైపులైన్ ఏర్పాటుకు 2021 నవంబర్లో శ్రీకారం చుట్టింది. పైపులైన్లను భూమిలో పాతిపెట్టే పనులు చేపట్టారు. కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తే తమ జీవనోపాధి దెబ్బతింటుందని మత్స్యకారులు ఆందోళన బాట పట్టారు. పనులను అడ్డుకున్నారు. దీంతో కంపెనీ యాజమాన్యం వెనక్కి తగ్గి, వేసిన పైపులైన్ను తొలగించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్తులో కూడా కొత్త పైపులైన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదన్న డిమాండ్తో మత్స్యకారులు నాటి నుంచి నేటి వరకూ 700 రోజులపాటు ధర్నాను కొనసాగించారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ను మత్స్యకారులు ఆశ్రయించారు. కోర్టులో కేసు విచారణ ఉంది. ఇటువంటి నేపథ్యంలో కొత్త పైపులైన్ వేసుకునేందుకు అన్ని అనుమతులూ తమకు ఉన్నాయని కంపెనీ యాజమాన్యం మరలా పోలీసు బలగాల నడుమ పైపులైను పనులు ప్రారంభించింది.

జిల్లా కలెక్టర్, ఎస్పిలకు ఫిర్యాదు

హెటిరో కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్ను వ్యతిరేకిస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టరేట్లో జరుగుతున్న స్పందనలో కలెక్టర్ రవి సుభాష్, ఎస్పి మురళీకృష్ణలకు ఫిర్యాదు చేసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, రాజయ్యపేట శాఖ కార్యదర్శి ఎం.మహేష్ బాబు తెలిపారు .

పోలీసు నిర్బంధాన్ని ఖండించండి : సిపిఎం

హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్కు సంబంధించిన అంశం జాతీయ హరిత ట్రిబ్యునల్లో విచారణలో ఉండగా చట్టాలను ఉల్లంఘించి సోమవారం రాజయ్యపేట గ్రామంలో పెద్దఎత్తున పోలీసులను మోహరించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి సంబంధిత యాజమాన్యం పైపులైన్ను వేయడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీలో వాడే వ్యర్థ రసాయన జలాలను సముద్రంలోకి వదలడానికి పాత పైపులైన్ ఉంటుండగా మరలా భారీ పైపులైన్ను వేస్తున్నట్టు తెలిపారు.

దీనిని నిరసిస్తూ రాజయ్యపేట గ్రామస్తులు 700 రోజులుగా రిలేదీక్షలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. వారి నిరసనను పట్టించుకోకుండా ప్రజాస్వామ్య హక్కులను ఖూనీచేస్తూ.. పోలీస్ నిర్బంధంతో గ్రామాన్ని చుట్టుముట్టి పైపులైన్ వేయడం దుర్మార్గమన్నారు. పాత పైపులైన్ వల్ల ఉపాధి కోల్పోయి.. వ్యాధుల బారినపడి అనేక మంది మరణించారని తెలిపారు. ప్రస్తుతం చాలా మంది కేన్సర్ వంటి వ్యాధుల బారిన పడి లక్షల రూపాయలు అప్పులు చేసి వైద్యం పొందుతున్నారన్నారు. తాజా పైపులైన్ వస్తే మత్స్యకారులు తీవ్రంగా ఉపాధి కోల్పోయి గ్రామాలు ఖాళీచేసి వెళ్లిపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2022 మార్చిలో ఎన్జిటి నియమించిన అత్యున్నత కమిటీ హెటిరో డ్రగ్స్ కంపెనీ, దాని పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రభావిత మత్స్యకారులతో మాట్లాడి విచారణ చేపట్టిందన్నారు. 2006 హెటిరో కంపెనీ ఉత్పత్తులు ప్రారంభించిన నాటి నుంచి ఏ విధమైన పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడిందో ఎత్తిచూపిందన్నారు. వేట నష్టపోయి, అనారోగ్యాల బారినపడి మరణించిన వారి వివరాలను నమోదుచేసి ఇంతటి ఘోరానికి పాల్పడినటువంటి హెటిరో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరిందని తెలిపారు.

రూ.6 కోట్ల అపరాధ రుసుము విధించిన విషయాన్ని గుర్తుచేశారు. వీటిపై నేటికీ ప్రభుత్వాలు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు వెంటనే స్పందించి మత్స్యకారుల జీవితాలను, కోర్టు కేసులను పరిగణనలోకి తీసుకుని కోర్టు కేసులు తేలేవరకు ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని పైపులైన్ వేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముదపాక రైతుల నిరసన

నిరసన తెలుపుతున్న ముదపాక రైతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెందుర్తి మండలం ముదపాక గ్రామంలో బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ల్యాండ్ పూలింగ్ ద్వారా తమ వద్ద తీసుకున్న డి-పట్టా భూములకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట మదపాక రైతులు నిరసన తెలిపారు. ఈ మేరకు స్పందనలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం రైతుల తరపున నీలాపు రమణ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశం మేరకు తమ భూములను ఇచ్చినట్టు తెలిపారు. అయితే తమకు ఎటువంటి నష్టపరిహారాన్నీ ఇంతవరకూ చెల్లించలేదన్నారు. ఇది అన్యాయమని అన్నారు. భూమి కోల్పోయిన వారంతా దళితులలని తెలిపారు. తమ భూములను రామరాజు అనే వ్యక్తి కొంతమేర స్వాహా చేశారని, కొంత భూమి అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డిఓలకు తాము విన్నవించిన విషయాన్ని గుర్తుచేశారు. సదరు అధికారుల ప్రమేయంతోనే రామరాజు భూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నష్టపరిహారం కోసం తాము హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు స్టేటస్కో ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. అయినప్పటికీ నష్ట పరిహారం చెల్లించలేదని, రామరాజు అక్రమాలపై చర్య తీసుకోలేదని తెలిపారు. కలెక్టర్, ఆర్డిఓ తీరును రైతులంతా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ముదపాక రమేష్, గొరపల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రంపచోడవరం : జాతీయ రహదారి విస్తరణ లో భాగంగా ఈ నెల 7న మంగళవారం గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు సంబంధించిన గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నంరెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎండీ యూసుఫ్ ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమతుల్లేని బాణసంచాపై కఠినచర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : అనుమతి లేకుండా బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలు తయారు జరిపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మోహన్కుమార్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశించిన నిబంధనలకు లోబడి, లాంటి ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ దీపావళిపండుగను జరుపుకోవాలని సూచించారు. బాణసంచా అమ్మకాలను లైసెన్స్, ముందస్తు అనుమతులు పొందిన వారు మాత్రమే సరైన జాగ్రత్తలు తీసుకుని విక్రయించాలని సూచించారు.తాత్కాలిక లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, జనావాసాలకు దూరంగా బాణసంచా అమ్మకాలు చేపట్టాలన్నారు. లైసెన్స్ కలిగి ఉన్న విక్రయిదారులైనా, అనుమతులు, లైసెన్స్ లేని వారికి బాణసంచా విక్రయించి, తద్వారా ఏదైనా ప్రమాదం సంభవించినా, దానికి లైసెన్స్దారులదే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పిల్లలు తల్లిదండ్రుల పర్యవేక్షణలో టపాసులు కాల్చాలని, ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ స్టేషన్ కు 101 లేదా పోలీస్ డయల్ 100/112 లకు తెలియజేయాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని పోలీసులకు తెలియచేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కోందుల సమస్యను పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం పంచాయతీ సంజీవ్నగర్ అటవీ ప్రాంతంలో నివసించే కోందు జాతి గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం రంపచోడవరం డివిజన్ సిపిఐ(ఎంఎల్)వినోద్ మిశ్రా, ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఐటిడిఎ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సంజీవ్నగర్ అటవీ ప్రాంతంలో నివసించే కొందు జాతి గిరిజనులను వారి నివాసాలను అటవీ అధికారులు తొలగించి, అడవి నుంచి బయటకు పంపశారన్నారు. ఎపి హైకోర్టులో దీనికి సంబంధించి కేసు నడుస్తున్నప్పటికీ, 12 కుటుంబాలకు చెందిన 32 మందిని పంపేయడం దారుణమన్నారు. దీంతో నిలువ నీడలేని పరిస్థితుల్లో గొర్నగూడెం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన తల దాచుకుంటున్నారన్నారు. పదేళ్లకుపైగా నివాసముంటున్న వారిని ఇలా అర్థాంతరంగా అడవి నుంచి గెంటేసి, నిలువ నీడ, తిండి లేకుండా రోడ్డున పడేయడం దుర్మార్గమన్నారు. వీరికి తినడానికి కనీసం రేషన్ బియ్యం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అడ్డతీగల మండలం దొర మామిడి పంచాయితీ కినపర్తి శివారు అడవిలో నివసిస్తున్న ఏడు కొందుజాతి కుటుంబాలు పరిస్థితి కూడా ఇలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై ఐటిడిఎ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో రంపచోడవరం డివిజన్ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోమల కుసల, నాగులపల్లి అర్జునుడు వడియాల అప్పలరాజు, కిల్లో సత్తిబాబు, డిప్పల చిన్న బ్బాయి, మర్రి రాంబాబు, గెమ్మలి చిన్న, గుంటా చిన్నారావు, వంతల రాజు పాల్గొన్నారు.

105 మంది రైతు బజార్ కార్డుల రద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని రైతు బజార్లకు ఏడాది కాలంగా హాజరు కాని 105 మంది రైతుల తాలూకా రైతు బజార్ కార్డులను రద్దు చేసినట్టు విశాఖ జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ సోమవారం తెలిపారు. 1825 మందికి రైతు బజార్లలో అమ్మకాలు చేపట్టేందుకు కార్డులు జారీ చేయగా 105 మంది ఏడాది కాలంగా హాజరు కావడం లేదన్నారు. స్థానిక తహశీల్దార్లు, మార్కెటింగ్ శాఖల అధికారులు నిర్వహించిన తనిఖీల్లో మరొక 165 మంది అనర్హులున్నట్లు గుర్తించామని, వారికి నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. అర్హులైనప్పటికీ సంబంధిత ధ్రువపత్రాలు సరిగ్గా సమర్పించని మరొక 64 మంది రైతులకు కూడా నోటీసులు ఇచ్చామన్నారు. నోటీసులు అందుకున్న రైతులు వారం రోజుల్లోగా సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ అధికారి, విశాఖపట్నం కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. లేనిపక్షంలో రైతు బజారు కార్డు రద్దవుతుందని పేర్కొన్నారు.